ANDHRA JYOTHI
27 MAR 2020
27 MAR 2020

# కర్ఫ్యూ కొనసాగింపు



నిర్మానుష్యంగా ఉన్న యానాంలోని ఓ వీధి

యానాం, మార్చి 26: నిబంధనలు ఉల్లంఘించిన ఐదుగురిని అరెస్టు చేసి, కేసులు నమోదు చేశామని సీఐ గూటం శివగణేష్ తెలిపారు. సుమారు 50 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. రోజంతా వాహన చోదకులను స్టేషన్‌లో ఉంచి హెచ్చరించి పంపించారు. ఈ వాహనాలకు బంక్‌ల్లో పెట్రోల్ పోయకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా వర్తకులతో యానాం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ నల్లం బాబు సమావేశం నిర్వహించారు. నిర్ణయించిన సమయాల్లో విక్రయాలు జరపాలని, నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆయన వర్తకులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్ప వని హెచ్చరించారు. యానాంలో కర్ఫ్యూ కొనసాగుతోంది. యానాం పరిపాలనాధికారి శివరాజ్‌మీనా పలువురి అధికారులతో కలిసి యానాం సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టులను పరిశీలించారు.

ENADU
27 MAR 2020
27 MAR 2020

# వచ్చేనెల 14 వరకు సబ్‌కోర్టు మూసివేత

యానాం: కరోనా వైరస్ విస్తృతిని అడ్డుకునే క్రమంలో మద్రాస్ హైకోర్టు, పుదుచ్చేరి చీఫ్ జస్టిస్ ఆదేశాల మేరకు యానాం కోర్టును ఏప్రిల్ 14 వరకు తాత్కాలికంగా మూసివేయనున్నట్లు సబ్‌జడ్జి ఎం.చంద్రన్ తెలిపారు. అత్యవసర కోర్టు సేవల కోసం కోర్టు క్లర్క్ దేవన శ్రీనివాసరావును సంప్రదించాలని సూచించారు.

# ధరల పట్టిక లేకుంటే అమ్మకాలు జరగనివ్వం

యానాం: యానాంలో ప్రతి దుకాణం వద్ద సరకుల ధరల పట్టిక ఏర్పాటు చేయాలని లేకుంటే అమ్మకాలను అనుమతించేది లేదని ప్రత్యేక రక్షణాధికారి ఎస్పీ నల్లం కృష్ణరాయ బాబు, తదితరులు స్పష్టం చేశారు. కరోనా వ్యాప్తి నియంత్రణకు అమలు చేస్తున్న ఆంక్షలపై చర్చించేందుకు ఎస్పీ కార్యాలయంలో కూరగాయలు, కిరాణా, మెడికల్ దుకాణాల యజమానులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఉదయం 6 నుంచి 9 వరకు వీధుల్లోకి వేల సంఖ్యలో జనం వస్తుండడంతో ప్రతి దుకాణం వద్ద చేతులు శుభ్రం చేసుకునేందుకు శానిటైజర్, సబ్బు, నీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలుదారుడు తగుదూరం పాటించేలా చూడాల్సిన బాధ్యత వ్యాపారులదేనని, ఏది పాటించకున్నా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులు మాత్రమే బయట కనిపించాలని, ఇతరులు ఇష్టానుసారంగా తిరగడాన్ని సహించేదిలేదని పుదుచ్చేరి ఉన్నత విద్యాశాఖ డైరెక్టరు వై.లక్ష్మీనారాయణరెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో పని చేస్తున్న, చదువుకుంటున్న పలువురు యానాం వాసులు ఆంధ్రా, తెలంగాణా సరిహద్దుల్లో చిక్కుకుపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు.




యానాంలో ఉదయం సరకుల కొనుగోలుకు వీధుల్లోకి వచ్చిన జనం

ప్రజాశక్తి PRAJA SAKTHI

27 MAR 2020

# కాయగూరలు అధిక ధరలకు అమ్మితే లైసెన్స్ రద్దు

ప్రజాశక్తి - యానాం

ప్రభుత్వ నిర్మయించిన ధరలకన్నా అధిక ధరలకు కూరగాయలు అమ్మితే పిడి యాక్ట్ కింద కేసు నమోదు చేసి లైసెన్స్ రద్దు చేస్తారని పుదుచ్చేరి ప్రత్యేక పోలీసు అధికారి (ఎస్‌పి) నల్లం కృష్ణరాయబాబు హెచ్చరించారు. కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నియోజకవర్గంలో కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ఆయన స్థానిక ఎస్‌పి భక్తవత్సలం, సిఐ శివగణేష్ ఆధ్వర్యంలో వర్తక వ్యాపారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 6 నుండి 9 గంటల వరకు నిత్యవసర వస్తువులకు సంబంధించిన వ్యాపారులు నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మార్కింగ్ చేసిన స్థలంలోనే కొనుగోలుదారులు నిలబడి తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, హ్యాండ్ వాష్ ఉండే విధంగా చూడాలని, ఏ గ్రామంలో ఉన్న వాళ్లు ఆ గ్రామంలోనే కొనుగోలు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. కాయగూరల వ్యాపారులు బయట ధరల పట్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కూరగాయల, కిరాణా, మెడికల్, పాలు తదితర వ్యాపారులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 14 వరకు కోర్టుకు సెలవులు

ప్రజాశక్తి - యానాం

కరోనా వైరస్ నేపథ్యంలో దేశవ్యాప్త లాక్ డౌన్ కారణంగా యానం తాలూకా సబ్ కోర్టుకు ఏప్రియల్ 14 వరకు సెలవు ప్రకటించినట్లు కోర్టు జడ్జి ఎం.చంద్రా ఒక ప్రకటనలో తెలిపారు. మద్రాస్ హైకోర్టులోని పుదుచ్చేరి చీఫ్ జడ్జి ఆదేశాల మేరకు సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. ప్రజలు, న్యాయ వాదులు గమనించగలరని తెలిపారు. అత్యవసర సేవల కోసం కోర్ట్ సిబ్బంది డీ.శ్రీనివాస్ సెల్ నం.7397086639 కు సంప్రదించాలని కోరారు.

# పరీక్షలు రాయకుండా పాస్

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో 1 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులను ఈ సంవత్సరం పాస్ చేస్తున్నట్లు పుదుచ్చేరి ఎడ్యుకేషనల్ డైరెక్టర్ పిటి రుద్ర గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో ఈ నెల 23 నుంచి ఏప్రిల్ 14 వరకు పుదుచ్చేరి వ్యాప్తంగా లాక్ డౌన్ ప్రకటించడంతో పుదుచ్చేరి, యానం, మాహే, కారైకాల్ నాలుగు ప్రాంతాలలో పరీక్షలు నిర్వహించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో వాటిని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్టు పాండిచ్చేరి ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయం యానంలోని అన్ని పాఠశాలలకు వర్తిస్తుందని యానాం విద్యాశాఖాధికారి కాలే సాయినాథ్ తెలిపారు.

ఆంధ్ర జ్యోతి A.D. Jyothy
27/3/2020



యానాంలోని కూరగాయల దుకాణం వద్ద సర్కిళ్లలో నిలబడి ఉన్న వినియోగదారులు